చినుకులతో చిత్తడి

- స్తంభించిన జన జీవనం
- అవస్థలు పడ్డ చిరు వ్యాపారులు
- రెండు నియోజకవర్గాల్లో వర్ష ప్రభావం


అంగరలో ఇటుక ముద్దలపై బరకం కప్పిన దృశ్యం

కపిలేశ్వరపురం: మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో గురువారం ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. ఉదయం నుంచీ చినుకులు పడుతూనే ఉన్నాయి. దాంతో ఉద్యోగులు, వ్యాపారులు తమ దైనందిన కార్యకలాపాల నిర్వహణకు ఇబ్బందులు పడ్డారు. ఇంటి నుంచి బయలుదేరాక వర్షం పెరగడంతో మార్గమధ్యలో అవస్థలు పడ్డారు. రామచంద్రపురం మండపేట పట్టణాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ చినుకులు పడుతూనే ఉండడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యాయి. గ్రామాల్లో పడిన చినుకులకు వీధులు చిత్తడిగా మారాయి. వర్షం కారణంగా డ్రెయిన్లలో చెత్త చేరడంతో పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణలో పారిశుధ్య కార్మికులు డ్రెయిన్లలోని పూడిక తొలగించారు. వర్షపు నీటి పారుదలకు అడ్డంకులను తొలగించారు.

అవస్థలు పడ్డ శ్రామికులు

మండపేట పరిసర గ్రామాల్లో 120 పైగా రైస్ మిల్లులు, రెండు పేపర్ మిల్లులు, మూడు ఆయిల్ ఫ్యాక్టరీల్లో వందలాది మంది కార్మికులు శ్రమిస్తున్నారు. కోళ్ల పరిశ్రమ ద్వారా ఇతర ప్రాంతాలకు గుడ్ల ఎగుమతి సాగుతుంది. రవాణా రంగంలో డ్రైవర్లు, సహాయకులు కోనసీమకు సరుకుల ఎగుమతి, దిగుమతులను చేస్తున్నారు. ఆయా సంస్థల్లో పట్టణంతోపాటు సమీప గ్రామాల నుంచి శ్రామికులు తరలి వస్తుంటారు. ఉదయమే వర్షం కురవడంతో వారంతా తీవ్ర అవస్థలకు గురయ్యారు.

మూత పడిన ఇటుక బట్టీలు

మండపేట నియోజకవర్గంలో సుమారు 300 ఇటుక బట్టీల్లో 3 వేల మంది వలస కార్మికులు శ్రమిస్తున్నారు. చినుకులకు బట్టీలు మూతపడ్డాయి. రాయవరం మండలం మాచవరం, కపిలేశ్వరపురం మండలంలోని అంగర, వెదురుమూడి, కపిలేశ్వరపురం గ్రామాల్లోని బట్టీలలో ఇటుకల తయారీ పనులు నిలిచిపోయాయి. ఇక్కడ నుంచి జిల్లాతో పాటు సమీప జిల్లాలకు ఇటుక రవాణా అవుతోంది. చినుకులకు ఎగుమతి నిలిచి పోయింది. విశాఖపట్టణం, విజయనగరం ప్రాంతాల నుంచి వచ్చిన వలస బట్టీ కార్మికులు పనిని కోల్పోయారు.


తాతపూడిలో డ్రెయిన్‌లోని పూడిక తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

నిలిచిన భవన నిర్మాణ పనులు

ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో భవన నిర్మాణ కార్మికులు పనులకు స్వస్తి పలికారు. రామచంద్రపురం, మండపేట, కపిలేశ్వరపురం ప్రాంతాల తాపీమేస్త్రీలు రెండు నియోజకవర్గాల్లో భవనాలను నిర్మిస్తున్నారు. వేసవిలో ప్రారంభమైన భవన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకోగా వర్షాలకు పనులు నిలిచిపోయాయి.

చిరు వ్యాపారుల అవస్థలు

రాయవరం, కపిలేశ్వరపురం మండలాలకు చెందిన ప్రజలు మండపేట పట్టణానికి, కె.గంగవరం మండలంలోని ప్రజలు రామచంద్రపురం పట్టణానికి చినుకులు కారణంగా రాకపోకలు తగ్గాయి. దీంతో పట్టణంలోని చిరువ్యాపారులు తమ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు అవస్థ పడ్డారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ సమావేశం వాయిదా

కాజులూరు: కాజులూరు అంబేద్కర్ భవన్‌లో గురువారం జరగాల్సిన వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం వాయిదా పడింది. పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించాలని పార్టీ మండల నాయకులు ఏర్పాట్లు చేశారు. తుపాను ప్రభావంతో ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా మండలంలోని పలు గ్రామాల నుంచి కార్యకర్తలు సమావేశానికి చేరుకునే అవకాశం లేకపోవటంతో కార్యక్రమాన్ని వాయిదా వేశారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ఎమ్మెల్యే వేగుళ్లకు కేబుల్ ఆపరేటర్ల సన్మానం

మండపేట: మరోసారి మండపేట ఎమ్మెల్యేగా ఎన్నికైన వేగుళ్ల జోగేశ్వరరావును నియోజకవర్గ కేబుల్ ఆపరేటర్లు పట్టణంలో సన్మానించారు. నియోజకవర్గ స్థాయి కేబుల్ ఆపరేటర్ల సమావేశం పట్టణంలోని కాపు కల్యాణ మండపంలో గురువారం సంఘ నాయకుడు దూలం నాగు ఆధ్వర్యంలో జరిగింది. ఎమ్మెల్యేగా గెలుపొందిన వేగుళ్లను కేబుల్ ఆపరేటర్లు ఘనంగా సత్కరించి, జ్ఞాపిక అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ కేబుల్ ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అమరావతి నిర్మాణం కోసం కేబుల్ ఆపరేటర్లు అంతా రూ.లక్ష చెక్కును విరాళంగా ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో మండపేట నియోజకవర్గం, అలమూరు మండలం కేబుల్ ఆపరేటర్లు సంక్షేమ సంఘం నాయకులు, ఆపరేటర్లు టపా రామకృష్ణ, మేడిశెట్టి వెంకటరమణ, మద్దిరెడ్డి మాణిక్యం, పులగం రామకృష్ణారెడ్డి, నక్కా వెంకటేశ్వరరావు, టేకి అన్నవరం, దాసరి బాబి, పుచ్చకాయల అబ్బు పాల్గొన్నారు.

పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్ల బహూకరణ


పాఠశాలకు ఫ్యాన్లు బహూకరిస్తున్న ఎంఈఓ ఆంజనేయులు

కె.గంగవరం: మండల కేంద్రమైన కె.గంగవరంలోని జెడ్పీ హైస్కూల్‌కు గురువారం ఎంఈఓ చోడిశెట్టి ఆంజనేయులు రూ.15 వేల విలువైన సీలింగ్ ఫ్యాన్లను బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీవీ రావు ఎంఈఓకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పీవీ బ్రహ్మానందం, ఏడుకొండలు, రాఘవకుమారి, సువర్చల తదితరులు పాల్గొన్నారు.

రోటరీ సేవలు అభినందనీయం

రాజోలు: ప్రపంచ వ్యాప్తంగా రోటరీ అందిస్తున్న సేవలు అభినందనీయమని పలువురు రొటేరియన్లు అన్నారు. గురువారం రాజోలు రోటరీ క్లబ్‌లో అధ్యక్షుడు ఏడిద కవీంద్ర అధ్యక్షతన పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ బసవ వరహాలు దంపతుల ఆర్థిక సాయంతో పాలగుమ్మి గ్రామానికి చెందిన మహిళకు కుట్టు మెషీన్ అందజేశారు. దివ్యాంగులైన మెరపాలెం గ్రామానికి చెందిన పున్నం సాయిబాబు, శివకోడు గ్రామానికి చెందిన ఏడుకొండలుకు లక్కింశెట్టి రత్నబాబు, బోళ్ల శ్రీను సహకారంతో ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. పేదరికంతో చదువు ఆగిపోకుండా రాజోలుకు చెందిన ముత్యాల లేఖ్య, పెదపట్నం లంక గ్రామానికి చెందిన గిడుగు శ్రీరామదుర్గకు రూ.5 వేల వంతున ఆర్థిక సాయాన్ని లక్కింశెట్టి రత్నబాబు అందజేశారు. రోటరీ పీడీజీ డాక్టర్ బసవ వరహాలు దంపతులను రాజోలు రోటరీక్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. రోటరీ కార్యదర్శి చిట్నీడి లక్ష్మణరావు, రొటేరియన్లు దార్ల పెదబాబు, నామన షణ్ముఖేశ్వరరావు, దంగేటి సురేష్, కసుకుర్తి రామకృష్ణ, బోళ్ల శ్రీనివాస్, మొహిద్దీన్ కిష్వర్, ఐ.సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వండి


మున్సిపల్ సిబ్బందికి సూచనలు చేస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

- మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి
- సిబ్బందితో సమీక్ష

మండపేట: వర్షా కాలంలో వచ్చే సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకుని పట్టణంలో మరింత మెరుగైన పారిశుధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధికారులకు సూచించారు. ప్రజలు కూడా సీజనల్ వ్యాధుల విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని చైర్ పర్సన్ దుర్గారాణి చాంబర్‌లో గురువారం ప్రజారోగ్య విభాగం ఉద్యోగులతో ఆమె సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కమిషనర్ బొడ్డేపల్లి రాము పలు సూచనలు చేశారు. వర్షాకాలం ఆరంభమైందని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉద్యోగులతో పాటు, ప్రజలు కూడా తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం మంచిదన్నారు. డ్రెయిన్‌లలో నిరాటంకంగా మురుగు పారేలా సిబ్బంది చూసుకోవాలన్నారు. వార్డుల్లో వ్యర్థాలు నిల్వ చేరకుండా చూసుకోవాల్సిన బాధ్యత పారిశుధ్య సిబ్బందిపై ఉందన్నారు. దోమల నివారణకు క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలని కమిషనర్ ఆదేశించారు. అలాగే పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు కూడా సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. భారీ వర్షం కురిసినపుడు మేజర్ డ్రెయిన్ మేన్ హోల్స్‌ను చెక్ చేసి మురుగునీరు రోడ్ల మీదకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చైర్ పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ పట్టణంలోని ఎస్సీ కాలనీలు, మురికివాడలు, పల్లపు ప్రాంతాల్లో శానిటేషన్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. వీధుల్లో చెత్త ఎత్తిన ప్రతీ చోటా తప్పకుండా బ్లీచింగ్ చల్లాలని సూచించారు. సమావేశంలో 8వ వార్డు కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి. లావణ్య, సచివాలయ కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి


రామచంద్రపురం ఏరియా ఆస్పత్రిలో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి రికార్డులు పరిశీలించిన అనంతరం ఆస్పత్రి పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేయాలని వైద్యులు, వైద్య సిబ్బందిని ఆదేశించారు. అవుట్ పేషెంట్లుగా వచ్చిన రోగులతో మాట్లాడి, వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ ఎస్.ప్రవీణ్, సిబ్బంది, పలువురు నాయకులు ఆయన వెంట ఉన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల వినతిపత్రం

రామచంద్రపురం రూరల్: సమగ్ర శిక్షా అభియాన్‌లో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకన్నబాబు ఆధ్వర్యంలో నాయకులు గురువారం రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలిశారు. తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. సమ్మె కాలంలో జీతాలు, మే, జూన్ నెలల జీతాల బడ్జెట్ సమస్యలను పరిష్కరించాలని, సమ్మె కాలపు హామీలు నెరవేర్చాలని కోరారు. సమగ్ర శిక్షా అభియాన్ 8 విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, వారికి ఈఎస్ఐ, ఈపీఎఫ్‌లు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

చకచకా జంగిల్ క్లియరెన్స్ పనులు

పర్యవేక్షించిన మున్సిపల్ కమిషనర్ రాము


వర్షంలో గొడుగు వేసుకుని టిడ్కో పనులు పర్యవేక్షిస్తున్న కమిషనర్ రాము

మండపేట: పట్టణంలోని టిడ్కో అపార్ట్‌మెంట్ల వద్ద చేపట్టిన జంగిల్ క్లియరెన్స్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇళ్లు లేని పేదల కోసం గొల్లపుంత రోడ్డులో ప్రభుత్వం టిడ్కో అపార్ట్‌మెంట్లు నిర్మించిన విషయం తెలిసిందే. కొన్ని అపార్ట్‌మెంట్లలోకి లబ్ధిదారులు ఇంకా గృహ ప్రవేశాలు చేయాల్సి ఉంది. లబ్ధిదారులకు త్వరితగతిన ఫ్లాట్లను అప్పగించేందుకు స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు టిడ్కో కాలనీలో మౌలిక వసతులపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఇక్కడ పెండింగ్, జంగిల్ క్లియరెన్స్ వంటి పనులను మున్సిపల్ అధికారులు చేయిస్తున్నారు. గురువారం ఉదయం నుంచి సన్నపాటి వర్షం కురుస్తున్నప్పటికీ లేకుండా ఇక్కడ పనులు చేయిస్తున్నారు. కమిషనర్ బొడ్డేపల్లి రాము ఆదేశాల మేరకు కార్మికులు, సిబ్బంది పనులను వేగంగా పూర్తి చేస్తున్నారు. కమిషనర్ రాము సైతం అక్కడే వుండి పనులను పర్యవేక్షిస్తున్నారు. వర్షంలో గొడుగు పట్టుకుని కాలనీ అంతా పర్యటిస్తూ జంగిల్ క్లియరెన్స్ చేయిస్తున్నారు. పొదులు, పనికిరాని మొక్కలు, పిచ్చి గడ్డిలను లాన్ మూవర్ల సాయంతో పూర్తిగా తొలగిస్తున్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్య, మున్సిపల్ సిబ్బంది పాలచర్ల లీలాకృష్ణ, చంద్రు రామకృష్ణ, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించండి


హసన్‌బాద అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న గ్రాడ్యుయేషన్ డే

రామచంద్రపురం రూరల్: ఆటపాటలతో విద్య, క్రమశిక్షణతో వ్యక్తిత్వ వికాసం అందించే అంగన్‌వాడీల్లో చిన్నారులను చేర్పించాలని సీడీపీఓ వరాహలక్ష్మి కోరారు. మండలంలోని హసన్‌బాద సెక్టార్‌లో 245వ సెంటర్ వద్ద గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో వేలాది రూపాయలు వసూలు చేసి అందించే ఎల్‌కేజీ, యూకేజీ విద్యలను అంగన్‌వాడీల ద్వారా ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కార్యకర్తలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ, విద్యను అందిస్తున్నారని తల్లిదండ్రులకు వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల కోసం అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలంటూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే ఉత్సాహంగా జరిగింది. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ జి.సూర్యావతి, ఆరోగ్య సిబ్బంది, మహిళా పోలీసు, అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంపొందించాలి


పసలపూడి పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న భగవాన్ భాయ్

రాయవరం: విద్యార్థి దశ నుంచే నైతిక విలువలను పెంపొందించేందుకు కృషి చేయాలని రాజస్థాన్ రాష్ట్రం మౌంట్ అబూ నుంచి వచ్చిన బ్రహ్మకుమార్ భగవాన్ భాయ్ సూచించారు. మండలంలోని పసలపూడి మెయిన్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను ఆయన స్థానిక ఓం శాంతి ఆశ్రమం బ్రహ్మకుమారీలతో కలసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా భగవాన్ భాయ్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మానవీయ విలువలు, నైతికత లోపిస్తున్నాయన్నారు. విద్యార్థి దశ నుంచే ఉపాధ్యాయులు, ఇంటి వద్ద తల్లిదండ్రులు నైతిక విలువలతో కూడిన విద్య అందించాలన్నారు. అప్పుడే మానవీయ విలువలతో కూడిన సమాజం ఆవిష్కృతమవుతుందన్నారు. అలాగే సమాజంలో శాంతియుత వాతావరణం ఏర్పడుతుందన్నారు. హెచ్ఎం కోరుమిల్లి వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో బ్రహ్మకుమారీలు మాధవి, విజయకుమార్ తదితరులు మాట్లాడారు. సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్షంతో స్తంభించిన జన జీవనం

కాజులూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో జోరు వాన కురిసింది. గత రెండు రోజుల నుంచి చెదురుమదురుగా వర్షపు జల్లులు పడుతుండగా, గురువారం ఉదయం నుంచి భారీ వర్షం పడింది. ప్రజలు బయటకు వచ్చేందుకు వీల్లేకపోవడంతో జనజీవనం స్తంభించింది. పల్లపు ప్రాంతాలు జలమయం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కాకినాడ–కోటిపల్లి రహదారిలోని గొల్లపాలెం చెరువు గట్టు సెంటరు వద్ద వర్షపు నీరు నిలిచి రోడ్డు మునిగిపోయింది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రస్తుతం పలువురు రైతులు పంట దమ్ములు చేసే పనిలో ఉన్నారు. ఈ దశలో వర్షాలు వరి పంట సాగుకు మేలు చేస్తాయని రైతులు చెబుతున్నారు.

29న పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిద్ధూ తదితరులు

రామచంద్రపురం: విజయవాడలో ఈ నెల 29న పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ నిర్వహిస్తున్నట్టు సంఘ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నాయకుడు బి.సిద్ధూ తెలిపారు. బుధవారం పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్ వద్ద ఈ మేరకు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిద్ధూ మాట్లాడుతూ స్వేచ్ఛ, సమానత్వం, శాస్త్రీయ విద్యా సాధన, నూతన ప్రజాస్వామిక వ్యవస్థ నిర్మాణాల కోసం పీడీఎస్‌యూ అవిశ్రాంతంగా కృషి చేస్తోందని వివరించారు. సంఘ నిర్మాణం కోసం ఎందరో తమ ప్రాణాలను అర్పించారని గుర్తు చేశారు. దేశంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలు, రాష్ట్రంలో ప్రత్యేక హోదా, విభజన హామీలు, విశాఖ ఉక్కు పరిరక్షణ తదితర అంశాలపై పీడీఎస్‌యూ పోరాడుతోందని తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు ఎస్.సుబ్బారాయుడు, హర్ష, పి.బాలాజీ, సీహెచ్ లక్ష్మణ్, సూర్య, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

కొండయ్యకు మెరిటోరియస్ అవార్డు


ఉప కులపతి జానకీరామ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కొండయ్య

అంబాజీపేట: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రంలో పనిచేస్తున్న పెనుగొండ మాల కొండయ్య మెరిటోరియస్ ఎంప్లాయీస్ అవార్డు అందుకున్నారు. బుధవారం తాడేపల్లిగూడెం సమీపంలో ఉన్న వెంకటరామన్నగూడెంలోని ఉద్యాన విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కొండయ్యకు ఈ అవార్డును బహూకరించారని స్థానిక కొబ్బరి పరిశోధనా కేంద్ర ఇన్‌చార్జి అధిపతి డా.వి.గోవర్ధన్‌రావు తెలిపారు. ఈ అవార్డును ఉద్యాన విశ్వవిద్యాలయ ఉప కులపతి డాక్టర్ తోలేటి జానకీరామ్ చేతుల మీదుగా కొండయ్య అందుకున్నట్టు చెప్పారు. కొబ్బరి పరిశోధనా కేంద్రం విస్తరణాధికారిగా కొండయ్య చేసిన సేవలకు ప్రతిగా ఈ అవార్డుతో పాటు, రూ.2,500 నగదు, ప్రశంసా పత్రం అందించారన్నారు. కొండయ్యకు అవార్డు లభించిడంపై డా.గోవర్ధన్ రావు, శాస్త్రవేత్తలు బి.నీరజ, డాక్టర్ వి.అనూష, ఎ.కిరీటి తదితరులు అభినందించారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు

అయినవిల్లి: మండలంలోని మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనులపై 2023–2024 సంవత్సరానికి సామాజిక తనిఖీల్లో భాగంగా నేదునూరు, శంకరాయగూడెం గ్రామాల్లో గురువారం గ్రామ సభలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఎస్ఆర్పీ వి.కనకారావు ఆధ్వర్యంలో డీఆర్పీలు, గ్రామ సోషల్ ఆడిట్ బృందాలు క్షేత్ర స్థాయిలో జాతీయ ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు చేశాయి. నివేదికలను గ్రామసభలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులకు వివరించారు.

విత్తన శుద్ధితో పంటకు ఆరోగ్యం

- నారు చల్లే ముందే తప్పనిసరి అంటున్న వ్యవసాయ నిపుణులు
- గ్రామాల్లో రైతులకు అవగాహన


శీలలో జీవ నియంత్రణ శిలీంధ్రంతో విత్తన శుద్ధి చేస్తున్న రైతులు (ఫైల్)

కాజులూరు: వ్యవసాయంలో రైతులు తొలిదశ నుంచి మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవటంతో పాటు, నారుమడుల్లో విత్తనాలు చల్లే ముందు తప్పనిసరిగా విత్తన శుద్ధి చెయ్యాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. రామచంద్రపురం నియోజక వర్గంలోని కాజులూరు, రామచంద్రపురం, కె.గంగవరం మండలాల్లో 67 ఎకరాల సాగుభూమి ఉండగా, ఈ ఏడాది సుమారు 52 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నట్టు అంచనా. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో ప్రస్తుతం అధిక శాతం రైతులు పంట దమ్ములు నిర్వహిస్తూ, నారుమడులు చల్లుకునే పనిలో ఉన్నారు. ఈ తరుణంలోనే విత్తనశుద్ధిపై అవగాహన తీసుకువచ్చేందుకు వ్యవసాయాధికారులు గ్రామగ్రామాన పర్యటిస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

డివిజన్‌లో కొందరు రైతులు నారు పోసి, నాట్లు వేసే విధానాన్ని అవలంబిస్తుండగా, కొందరు రైతులు వెదచల్లిక(నేరుగా వరి విత్తనాలను దమ్ము చేసిన పొలంలో చల్లటం) విధానాన్ని పాటిస్తున్నారు. ఆయా విధానాల్లో తప్పనిసరిగా సూడోమోనాస్ ఫ్లోరెసెస్ అనే జీవ నియంత్రణ శిలీంధ్రంతోనూ, ఫాస్ఫో బ్యాక్టీరియా అనే భాస్వర జీవన ఎరువుతోనూ, అజో స్పైరిల్లమ్ అనే నత్రజని ఎరువుతోనూ విత్తనశుద్ధి చెయ్యాలని వ్యవసాయాధికారి అశోక్ సూచిస్తున్నారు.

విత్తన శుద్ధి.. ఉపయోగాలు

సూడోమోనాస్ ఫ్లోరెసెస్ అనే జీవ నియంత్రణ శిలీంధ్రంతో విత్తన శుద్ధి చేస్తే, వరిలో అధికంగా వచ్చే అగ్గి, మాగుడు, పొడ తెగుళ్లు రాకుండా, 30 నుంచి 40 రోజులు పూర్తిగా రక్షణ కల్పిస్తుంది. ఫాస్ఫో బ్యాక్టీరియా అనే భాస్వరపు జీవన ఎరువుతో విత్తన శుద్ధి ద్వారా భూమిలో దొరకని భాస్వరాన్ని మొక్కలకు లభ్యమయ్యేలా చేస్తుంది. అజో స్పైరిల్లమ్ అనే నత్రజని ఎరువు వలన ఎకరానికి ఎనిమిది నుంచి 16 కిలోలకు సరిపడా నత్రజని పైరుకు అందుతుంది. ఎకరానికి సరిపడా విత్తనాలకు 400 గ్రాముల జీవన ఎరువులను బాగా పట్టించి, నారుమడి లేదా వెదచల్లిక పొలాల్లో చల్లాలి. అలా వీలు కాకపోతే 20 కిలోల పశువుల ఎరువులో కలిపి ఎకరం పొలంలో నేలపై చల్లుకోవాలి.

మంచి ఫలితాలు కనిపిస్తున్నాయి



గత ఏడాది వ్యవసాయాధికారుల సూచనల మేరకు విత్తన శుద్ధి చేసి, విత్తనాలు నారుమడిలో చల్లాను. మంచి ఫలితాలు కనిపించాయి. చిన్నపాటి ఈదురుగాలులు, వర్షాలకు పంట పడిపోకుండా నిలబడింది. చాలా వరకూ అగ్గితెగులు, మాగుడు తెగులు, పొడ తెగులును తట్టుకుంది.

– ద్వారంపూడి సోమిరెడ్డి, రైతు, మొగలిపాలెం

శ్రమకు మించిన ఫలితం



విత్తన శుద్ధి వలన రైతుకు శ్రమకు మించిన ఫలితం దక్కుతుంది. సూడోమోనాస్ ఫ్లోరెసెస్, ఫాస్ఫో బాక్టీరియా, అజో స్పైరిల్లమ్‌లతో విత్తన శుద్ధి చెయ్యటం ద్వారా పైరు దృఢంగా పెరిగి, ఎరువులు, పురుగు మందుల ఖర్చు తగ్గుతుంది.

– వి.అశోక్, మండల వ్యవసాయాధికారి

విద్యతోనే భావి తరాలకు భవిష్యత్తు


అంబాజీపేటలో ర్యాలీని నిర్వహిస్తున్న డీఈఓ కమలకుమారి

డీఈఓ కమలకుమారి

అంబాజీపేట: చదువుతోనే భావితరాలకు బంగారు భవిష్యత్తు సాధ్యమవుతుందనే విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు గ్రహించి, పిల్లలను పాఠశాలలకు పంపాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి అన్నారు. అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ–1 కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన నేను బడికి పోతా విద్యా ప్రవేశ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ కమలకుమారి మాట్లాడుతూ విద్యార్థుల్లో పాఠశాలలకు వచ్చే కోరికను కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని, దానికి విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమన్నారు. ఈ నెల 6 నుంచి జూలై 12 వరకు నెల రోజుల పాటు క్షేత్రస్థాయిలో సర్వే చేసి, బయట తిరుగుతున్న 6 నుండి 14 ఏళ్ల బడిఈడు పిల్లలను స్కూళ్లలో చేర్పించే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఎంపీడీఓ చైర్మన్‌గా ఆయా గ్రామాల పరిధిలోని పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, సోషల్ వెల్ఫేర్ కమిటీ, పేరెంట్స్ కమిటీ, ఐసీడీఎస్ సిబ్బంది, సచివాలయ సోషల్ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు బృందంగా ఏర్పడి, బయట తిరుగుతున్న పిల్లలను గుర్తించాలన్నారు. వారి తల్లిదండ్రుల సహకారంతో బడిలో చేర్పించాలన్నారు. బడి ఈడు పిల్లలందరినీ స్కూళ్లలో చేర్పించి, బడి బయట పిల్లల్లేని గ్రామాలుగా ప్రకటించుకోవాలన్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న స్టూడెంట్ కిట్లతో పాటు, విద్యా ప్రోత్సాహకాలపై పిల్లల తల్లిదండ్రులకు తెలపాలన్నారు. కమిటీలు బాధ్యతగా వ్యవహరించి, ప్రతి ఇంటిని సందర్శించాలన్నారు. అనంతరం నేను బడికి పోతా అవగాహనా ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏపీసీ మధుసూదనరావు, ఎంపీడీఓ జి.సరోవర్, డీవైఈఓ కె.సూర్యప్రకాశరావు, ఏపీఓ ఎంఏకే భీమారావు, ఏఎల్ఎస్ కో–ఆర్డినేటర్ జి.రమేష్, తహసీల్దారు జె.విమలకుమారి, ఎంఈఓ–2 మోకా ప్రకాష్, హెచ్ఎంలు కె.సాయిరామ్. పీవీ కేశవాచార్యులు, పంచాయతీ కార్యదర్శులు జీజీవీకే కుమార్, వి.లక్ష్మీపతి, కాంప్లెక్స్ హెచ్ఎంలు, సీఆర్పీలు, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.